సాక్షి జగిత్యాల



పంటల పరిశీలన

జగిత్యాలఅగ్రికల్చర్: వరిలో కాండం తొలుచు పురుగు ఆశించిన నేపథ్యంలో శాస్త్రవేత్తలు పంటలు పరిశీలించి సూచనలు చేశారు.



కుష్ఠు నిర్మూలనపై ప్రతిజ్ఞ

జగిత్యాల: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠు నిర్మూలనపై డీఎంహెచ్‌వో శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించారు.

గరిష్టం/కనిష్టం

31.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి పూట ఎండగా ఉంటుంది. సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యారంగంలో గణనీయమైన అభివృద్ధి



స్కాలర్‌షిప్ అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్(జగిత్యాల): జిల్లా విద్యారంగం గణనీయమైన అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మలబార్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ఉపకారవేతనాలు పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లాకు వైద్య కళాశాల, నర్సింగ్ కాలేజీ, 5 జూనియర్, ఒక డిగ్రీ కళాశాలను తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కాగా, కళాశాలకు చేరుకోవడానికి బస్సు సకాలంలో రావడం లేదని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆర్టీసీ డీఎంతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఎంపీపీ మసర్తి రమేశ్, కేడీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, మలబార్ ప్రతినిధి సిద్దు, ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నష్టాలను అధిగమించాలి

మెట్‌పల్లి(కోరుట్ల): ప్రకృతి వైపరీత్యాలపై అవగాహన కలిగి ఉంటే, వాటి ద్వారా సంభవించే నష్టాలను అధిగమించడానికి అవకాశం ఉంటుందని ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ బితిన్‌సింగ్ అన్నారు. వెల్లుల్ల రైతువేదికలో సోమవారం 'ప్రకృతి వైపరీత్యాలు.. తీసుకోవాల్సిన చర్యలు'పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలతో ఆస్తి, ప్రాణ నష్టాలు జరుగుతాయన్నారు. వీటినుంచి రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించి ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, ఫైర్ ఆఫీసర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం



సత్కారం పొందిన మహిళలు

రాయికల్(జగిత్యాల): ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ కల్చరల్ అసోసియేషన్, గల్ఫ్ తెలంగాణ వెల్ఫేర్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూఏఈలోని తెలుగు మహిళలను సోమవారం సత్కరించారు. యూఏఈలోని షార్జాలో నిర్వహించిన బతుకమ్మ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా సేవా రంగంలో ప్రతిభ కనబర్చినందుకు వారికి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎన్‌సీఏ అధ్యక్షుడు మిర్యాల వరప్రసాద్, జీటీడబ్ల్యూసీఏ నాయకుడు శ్యాముల్, గల్ఫ్ తెలంగాణ అధ్యక్షుడు జువ్వాడి శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు సలాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై దృష్టి

జగిత్యాలటౌన్: ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రవి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా పలు సమస్యలపై 29 అర్జీలు స్వీకరించారు. బాధితులతో ఆయన మాట్లాడారు. ప్రతీసోమవారం వచ్చే సమస్యలకుతోడు పెండింగులో ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బీఎస్ లత, మకరంద్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి



నివాళి అర్పిస్తున్న పోలీసులు, ఉద్యోగులు

జగిత్యాలక్రైం: భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన మహనీయులను స్మరించుకోవాలని ఆర్ఐ వామనమూర్తి కోరారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం గాంధీజీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల త్యాగాలు స్మరిస్తూ రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన అమరవీరుల త్యాగాలకు మనం ఏళ్లవేళలా రుణపడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్సైలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి చైర్మన్‌గా శ్రీనివాస్

- జగిత్యాల మున్సిపల్ ఉత్కంఠకు తెర
- భోగ శ్రావణి రాజీనామా ఆమోదం
- వైస్ చైర్మన్‌కే ఇన్‌చార్జి బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ రవి
- బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్



PROCEEDINGS OF THE COLLECTOR & DISTRICT MAGISTRATE
MUNICIPAL ADMINISTRATION DEPARTMENT, JAGTIAL DISTRICT.

ఉత్తర్వుల కాపీ

జగిత్యాల మున్సిపల్ ఉత్కంఠకు తెర



జగిత్యాల మున్సిపల్ చైర్మన్‌గా శ్రీనివాస్‌కు నియామక పత్రం అందిస్తున్న కమిషనర్ నరేశ్

కొత్త చైర్మన్‌కు అన్ని బాధ్యతలు

తెలంగాణ 2009 సెక్షన్ 34 ప్రకారం వైస్ చైర్మన్ శ్రీనివాస్‌కు బాధ్యతలు ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కమిషనర్ బోనగిరి నరేశ్ చైర్మన్ బాధ్యతల ఉత్తర్వు కాపీ అందించారు. ఇదిలా ఉంటే.. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు పూర్తిస్థాయి అధికారం ఉంటుంది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నుంచి మళ్లీ చైర్మన్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ వచ్చేంత వరకు ఆయనే ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతారు. తదుపరి శ్రావణి రాజీనామా సమాచారాన్ని అధికారులు స్టేట్ ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా వ్యవహారంలో ఇన్ని రోజులు కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. రాజీనామా ఆమోదిస్తారా.. లేదంటే రాజీకి వెళ్తారా.. అనే అనుమానాలకు ఎట్టకేలకు ఫుల్‌స్టాప్ పడింది. చైర్‌పర్సన్ భోగ శ్రావణితో చర్చించిన కలెక్టర్ రవి.. ఆమె రాజీనామాను ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు.

కలెక్టర్ కార్యాలయానికి పిలిచి..

- సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కలెక్టర్ కార్యాలయానికి చైర్‌పర్సన్ భోగ శ్రావణిని కలెక్టర్ రవి పిలిచారు. 'ఈ లేఖ మీరే రాశారా..? పోర్జరీ ద్వారా వచ్చిందా..? రాజీనామా ఎందుకు చేశారు..? అనే విషయాలు తెలుసుకున్నారు. ఆమె స్పందిస్తూ.. 'నా ఇష్టపూర్వకంగానే రాజీనామా చేశా. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వేధింపుల వల్లే' అని పేర్కొన్నారు. దీంతో ఆ విషయాన్ని లేఖ ద్వారా ఇవ్వాలని కలెక్టర్ సూచించగా వెంటనే మరోసారి లేఖ రాసి ఇచ్చారు. సాయంత్రం 4 గంటలకు ఆమె రాజీనామాను ఆమోదించారు.

మూడేళ్లకే రాజీనామా..

- జగిత్యాల మున్సిపాలిటీగా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు ఆరుగురు చైర్మన్లు కొనసాగారు. ఏ చైర్మన్ అయినా పూర్తిస్థాయిలో ఐదేళ్లపాటు పనిచేశారు. కానీ.. జగిత్యాల చరిత్రలో టీఆర్ఎస్ మొదటిసారి పాలకవర్గంలోనే మూడేళ్లకే రాజీనామా చేయడం గమనార్హం.

ఆశావహుల హడావుడి..

- మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణి రాజీనామా ఆ మోదం కావడంతో ఆశావహుల్లో సందడి మొదలైంది. నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోలి శ్రీనివాస్‌తో అప్పుడే సమావేశమయ్యారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయగానే చైర్‌పర్సన్ ఎన్నిక జరిగే అవకాశం ఉంటుంది. బీసీ మహిళ జనరల్ జగిత్యాల మున్సిపల్‌కు కేటాయించారు.

నాటకీయ పరిణామాల మధ్య..

- నెల రోజులుగా జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ విషయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని కౌన్సిలర్లు ఈనెల 21న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు లేఖ ఇచ్చారు. అప్పటి నుంచి అవిశ్వాసం రగులుకుంటూ వచ్చింది. మొత్తం 33 మంది సభ్యులు శ్రావణి ఉండవద్దని మొదటి నుంచి ఏకతాటిపై ఉన్నారు. చివరగా 27 మంది ఎమ్మెల్యేకు లేఖ ఇచ్చారు. తదుపరి ఒక్కొక్కరుగా అవిశ్వాసం కాకుండా చైర్‌పర్సన్‌ను దింపేయాలనే నిర్ణయానికి వచ్చా రు. ఈ పరిణామాలన్నింటి మధ్య తానే రాజీనామా చేయాలని చైర్‌పర్సన్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఆ పరిణామం అధిష్టానానికి ఇబ్బందికరంగా మారింది. మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ రమణ, పార్టీ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అందరినీ సమన్వయం చేసి రాజీనామా వెనక్కి తీసుకునేలా ప్రయత్నం చేసేలా చూద్దాం అని అనుకునే లోపే చైర్‌పర్సన్ ప్రెస్‌మీట్ పెట్టి నిర్ణయం వెల్లడించారు. అంతేకాదు ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు చేశారు. దీంతో కచ్చితంగా ఆమెను పదవి నుంచి తొలగించాల్సిందేనని మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేపై కౌన్సిలర్లు ఒత్తిడి తీసుకువచ్చారు. అప్పటికే రాజీనామా లేఖ పంపించినప్పటికీ మూడు రోజుల అనంతరం కలెక్టర్ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమెను పదవి నుంచి తొలగించడంతో తాము విజయం సాధించామని కౌన్సిలర్లు పేర్కొంటున్నారు.



కలెక్టర్‌కు రాజీనామా లేఖ అందిస్తున్న శ్రావణి

ఇప్పటికే గతంలో చైర్‌పర్సన్ పదవిని ఆశించిన వారిలో సమిండ్ల వాణి, బండారు రజిని ఉండగా, ప్రస్తుతం వారి పేర్లే మళ్లీ వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాజీనామా చేసిన భోగ శ్రావణి పద్మశాలీ వర్గానికి చెందిన వారు కావడంతో అదే వర్గానికి చెందిన అడువాల జ్యోతికి ఇవ్వాలని ఆ వర్గం కోరుతోంది.

శ్రావణి పయనం ఎటు..?

- భోగ శ్రావణి మొదటిసారి 37 వార్డు నుంచి గెలు పొందారు. ఆమె మామయ్య భోగ వెంకటేశ్వర్లు గతంలో టీడీపీ నుంచి కౌన్సిలర్‌గా పనిచేశారు. ఎమ్మెల్సీ రమణ అనుచరుడిగా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సైతం అప్పట్లో కొనసాగారు. ఆయన వారసురాలిగా రాజకీయ అరంగేట్రం చేసిన శ్రావణి వృత్తిరీత్యా డాక్టర్. కౌన్సిలర్‌గా గెలిచిన ఆమెకు అతిచిన్న వయస్సు (27 ఏళ్లలోనే)లోనే మున్సిపల్ చైర్‌పర్సన్ పదవీ వరించింది. కానీ.. ఆ పదవి మూడేళ్ల ముచ్చటే అన్నట్లు మిగిలిపోయింది. నాటకీయ పరిణామాల మధ్య ఆమె రాజీనామా చేయాల్సి వచ్చింది. కాగా.. శ్రావణి కొద్దిరోజుల క్రితం బీజేపీ అగ్రనాయకులతో మంతనాలు జరిపారనే ఆరోపణలు సైతం వినిపించాయి. త్వరలో బీజేపీలో చేరే అవకాశం ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటారనే వార్తలు సైతం వినవస్తున్నాయి.

గోలి శ్రీనివాస్ ప్రొఫైల్..



- ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోలి శ్రీనివాస్ ఆర్యవైశ్యుడు. వయస్సు 51 సంవత్సరాలు. ఇంటర్ వరకు చదువుకున్న శ్రీనివాస్ వ్యాపార రంగంలో కొనసాగుతున్నారు.
- గతంలో కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడిగా కొనసాగారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రోత్సాహంతో రాజకీయ అరంగేట్రం చేశారు. 44వ వార్డు కౌన్సిలర్‌గా విజయం సాధించారు.
- ఎప్పుడైనా మైనార్టీలకు దక్కే వైస్ చైర్మన్ పదవీని శ్రీనివాస్ దక్కించుకున్నారు.
- అనూహ్య పరిణామాల నేపథ్యంలో భోగ శ్రావణి తన పదవీకి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న గోలి శ్రీనివాస్‌కు చైర్మన్‌గా అవకాశం వచ్చింది.

చైర్‌పర్సన్ పదవికే రాజీనామా..

కలెక్టర్ పిలిచి వివరణ కోరిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. చైర్‌పర్సన్ పదవికి మాత్రమే రాజీనామా చేశానని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని మాజీ చైర్‌పర్సన్ శ్రావణి పేర్కొన్నారు. పదవిలో ఉన్నా ఏమీ చేయలేకపోతున్నామని, ఎమ్మెల్యే వేధింపులు భరించలేకనే వదిలేశానని చెప్పారు. ఉద్యమకారులకు ఇస్తారో, బడా కాంట్రాక్టర్లకు ఇస్తారో చూడాలని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ మరోసారి రాజీనామాపై వివరణ కోరారని, తన ఇష్టపూర్వకంగా రాజీనామా చేసినట్లు ఒప్పుకున్నానని వెల్లడించారు.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తా

శ్రావణి రాజీనామాతో వైస్‌చైర్మన్‌గా ఉన్న నన్ను చైర్మన్‌గా నియమించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సహకారంతో తోటి కౌన్సిలర్లతో సమన్వయంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తా. కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే వరకు పారిశుధ్యం, ఇతరత్ర పనులపై శ్రద్ధ చూపి పట్టణాభివృద్ధిలో పాలుపంచుకుంటా.

– గోలి శ్రీనివాస్, మున్సిపల్ కొత్త చైర్మన్

సహకార సంఘాలకు మహర్దశ

- రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్



చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

పెగడపల్లి(ధర్మపురి): సహకార సంఘాలకు మహర్దశ పట్టనుందని రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. నంచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.40 లక్షలు వెచ్చించి నిర్మించిన ఎరువుల గోడౌ, రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన రామాలయ గాలిగోపురం, దీకొండలో సుమారు రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను టిస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావుతో కలిసి సోమవారం మంత్రి ప్రారంభించారు. అంతకుముందు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా బతికపల్లిలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ, రైతులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఆర్థికంగా పరిపుష్టి సాధించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుల సంక్షేమం కోసం తెలంగాణలో అమలవుతున్న పథకాలను పక్క రాష్ట్రాల్లోని రైతు సంఘాల నాయకులు కీర్తిస్తున్నారని గుర్తుచేశారు. బీజేపీ నాయకులు చెప్పేటివన్నీ అబద్ధాలేనని విమర్శించారు. టిస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ సహకార సంఘాలకు నాబార్డు రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాల ద్వారా రూ.6 వేల కోట్ల వ్యాపారం జరుగుతోందని తెలిపారు. ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, డీఆర్డీవో లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభ, సహకార సంఘాల చైర్మన్లు ఉన్నారు.

ఆయకట్టుకు సాగునీరు



ఆర్వీ ప్రధాన కాలువకు వెళ్తున్న నీరు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన సాగునీరు సోమవారం రోళ్లవాగు ప్రధాన(ఆర్వీ మెయిన్) కాలువకు చేరింది. ప్రస్తుతం 55 క్యూసెక్కులు విడుదల చేశారు. ఆర్వీ ప్రధాన కాలువ ద్వారా బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని దాదాపు 9 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అధికారులు తెలిపారు. ఆదివారమే నీటిని విడుదల చేయాల్సి ఉండగా.. ప్రాజెక్టులోకి ఆశించినస్థాయిలో నీరు చేరలేదు. దీంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు.

కంటి పరీక్ష చేయించుకోండి

- బీర్‌పూర్ అభివృద్ధి కనిపిస్తుంది
- మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచన



ప్రాజెక్టులో నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి పరీక్ష కార్యక్రమంలో కంటి పరీక్ష చేయించుకుంటే కాంగ్రెస్ హయాంలో బీర్‌పూర్‌లో జరిగిన అభివృద్ధి మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు కనిపిస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బీర్‌పూర్‌లోని రోళ్లవాగు ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న సాగునీటిని రైతులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించి మాట్లాడారు. రోళ్లవాగు నుంచి నీరు విడుదల చేయాలని రైతులతో కలిసి తాను ధర్నా చేస్తే మంత్రి తప్పుపట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈనెల 15న నీటిని విడుదల చేస్తామని జెడ్పీ సమావేశంలో మంత్రి ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పటికీ నీరు విడుదల కాకపోవడంతో నార్లు ముదిరిపోతున్నాయనే రైతుల ఆందోళనను అర్థం చేసుకుని సాగునీటికోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ధర్నా చేశామని తెలిపారు. గోదావరి నదీతీరంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే ఎత్తిపోతలు ఏర్పాటయ్యాయని గుర్తుచేశారు. రాజుల చెరువును రోళ్లవాగు ప్రాజెక్టుగా మార్చి ఎస్సారెస్పీ నుంచి నీటిని తరలించిందని, తద్వారా 15వేల ఆయకట్టు సాగులోకి వచ్చేలా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. ఎంపీపీ మసర్తి రమేశ్, జెడ్పీటీసీ పాత పద్మ, సింగిల్ విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఫాగింగ్ మరిచిన అధికారులు

- వృద్ధి చెందుతున్న దోమలు
- వ్యాధుల బారిన ప్రజలు
- నిర్లక్ష్యంలో బల్దియా అధికారులు

జగిత్యాల: జిల్లాలోనే అతిపెద్ద మున్సిపాలిటీ జగిత్యాల. 48 వార్డులు ఉన్నాయి. సుమారు లక్ష జనాభా ఉంది. మారుతున్న వాతావరణ పరిస్థితులతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పట్టణవాసులపై దాడి చేస్తున్నాయి. వీటి నియంత్రణకు అందుబాటులోకి తీసుకొచ్చిన ఫాగింగ్ యంత్రాలను వినియోగించడంలేదు. మొత్తం నాలుగు మిషన్లు ఉండగా.. రెండు మూలనపడ్డాయి. మరోరెండింటితో నిత్యం ఫాగింగ్ చేయడం కష్టతరంగా మారింది.

ఒక్కోదానికి రూ.1.50లక్షల వ్యయం..

- సుమారు 60 లీటర్ల సామర్థ్యం కలిగిన నాలుగు ఫాగింగ్ మిషన్లను రెండేళ్ల క్రితం బల్దియా అధికారులు కొనుగోలు చేశారు.
- ఒక్కోదానికి రూ.1.50లక్షలు వెచ్చించారు.
- కొనుగోలు చేసిన యంత్రాలను పారిశుధ్య విభాగపు గదిలో భద్రంగా ఉంచారు.
- ఫాగింగ్ యంత్రాల కోసం ప్రత్యేకంగా ఒక వాహనం(ఆటోలాంటిది) అవసరమని, అది లేకనే వాటిని మూలన ఉంచారని అధికారులు చెబుతున్నారు.
- వాహనాలే లేనప్పుడు ఫాగింగ్ యంత్రాలు ఎందుకు కొనుగోలు చేశారని ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రశ్నించినా సరైన సమాధానం రావడంలేదు.
- మిషన్లను పారిశుధ్య విభాగానికి అప్పగించామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.
- కానీ, వాటిని మాకు ఇంకా ఇవ్వలేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎల్లం ప్రకటించడం విశేషం.



పాత వాహనాలు వినియోగించే వీలున్నా..

- ఫాయింగ్ యంత్రాల కోసం పాత వాహనాలు ఏవైనా(ఆటోల్లాంటివైనా) వినియోగించి వార్డుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేసే అవకాశం ఉందని ఇంజినీరింగ్ అధికారులు వెల్లడిస్తున్నారు.
- ఇలాంటివి మున్సిపాలిటీలో ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు.
- పాత వాహనాలను కూడా పారిశుధ్య అధికారులకు అప్పగించామని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు.
- కానీ, అవి తమకు అందలేదని పారిశుధ్య విభాగం స్పష్టం చేస్తోంది.
- లోపం ఎక్కడుందో కానీ, వ్యాధుల బారినపడి పట్టణవాసులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.

పూడిక తొలగించడంలేదు..

- వివిధ వార్డుల్లోని డ్రైనేజీల్లో పూడిక తొలగించడంలేదు. నీటి నిల్వలు, మురుగునీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయడంలేదు. ఫలితంగా దోమలు, ఈగలు, క్రిమికీటకాలు వృద్ధి చెందుతున్నాయి. అవి ప్రజలపై దాడి చేయడంతో వ్యాధులు విజృంభిస్తున్నాయి.

వ్యాధుల బారిన ప్రజలు..

చలికాలంలోనూ దోమలు వృద్ధి చెంది పట్టణ ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. వీటి బారినపడ్డ స్థానికులు మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిత్యం అవుట్ పేషెంట్ల సంఖ్య వెయ్యికిపైగా, ఇన్‌పేషెంట్ల సంఖ్య 200కు పైగా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.

మాకు అప్పగించలేదు

మున్సిపాలిటీలో నాలుగు ఫాగింగ్ మిషన్లు ఉన్నాయి. రెండు పనిచేయడం లేదు. వాటిని మరమ్మతుకు పంపించాం. కానీ వాటిని మాకు అప్పగించలేదు. ఇంజినీరింగ్ విభాగంలోనే ఉన్నాయి. నిత్యం రెండు యంత్రాలతో పట్టణంలో ఫాగింగ్ చేయిస్తున్నాం. ఫాగింగ్ సమయంలో దోమలు ఇళ్లలోకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. – ఎల్లం, శానిటరీ ఇన్‌స్పెక్టర్

జగిత్యాల బల్దియా స్వరూపం

వార్డులు	48
హ్యాండ్ పంపులున్న ఫాగింగ్ మిషన్లు	4
పనిచేస్తున్న యంత్రాలు	2
మూలనపడ్డవి	2
ఒక్కోదానికి వెచ్చించిన నిధులు(రూ.లక్షల్లో)	1.5

పంచాయతీ నిధులకు 'తాళం'

- జిల్లాలో రూ. 250 కోట్ల నిధులు ఫ్రీజింగ్
- బిల్లులు రాక ఇబ్బంది పడుతున్న సర్పంచులు


లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ

జగిత్యాలరూరల్: జిల్లాలోని గ్రామపంచాయతీల ఖాతాలను ఫ్రీజింగ్ చేయడంతో ఆయా గ్రామాల్లో సర్పంచులు చేపట్టిన పనులకు బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నారు. 380 గ్రామపంచాయతీలకు గతంలో తీసిన పాత ఖాతాల్లో స్టేట్ ఫైనాన్స్ నిధులు, 15 ఫైనాన్స్ నిధులు ఉండగా ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులకు కేంద్రం ప్రత్యేక బ్యాంక్ ఖాతాలు తెరిచింది. గతంలో ఉన్న బ్యాంక్ ఖాతాల్లో ఉన్న నిధులకు సర్పంచులు పనులు చేయగా ఖాతాలకు ఫ్రీజింగ్ పెట్టడంతో డబ్బులు తీసుకునేందుకు నెలల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నెలనెలా వచ్చే నిధుల కోసం, కేంద్ర ప్రభుత్వం వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధుల కోసం గ్రామపంచాయతీకి ఒకే ఖాతా ఉండేది. అందులో రెండు రకాల నిధులు జమ అవుతుండేవి. జమైన తర్వాత చెక్కుల రూపంలో ఎస్టీవో ద్వారా పనుల రికార్డుల తర్వాత సర్పంచులు డబ్బులు డ్రా చేసుకునే వారు. కానీ కేంద్ర ప్రభుత్వం గత నాలుగు నెలల క్రితం ప్రతీ గ్రామపంచాయతీకి ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరిపించి అందులో నిధులు జమ చేస్తున్నారు.

పాత ఖాతాల్లో నిలిచిన నిధులు

గతంలో గ్రామపంచాయతీలకు ఉన్న బ్యాంక్ ఖాతాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు జమచేశాయి. దీంతో జిల్లాలో 380 గ్రామపంచాయతీల్లో సుమారు రూ.250 కోట్ల మేరకు డబ్బులున్నట్లు సర్పంచులు చెబుతున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులు తీసేందుకు గత అక్టోబర్ నుంచి ఫ్రీజింగ్ పెట్టడంతో డబ్బులు డ్రా చేసుకునేందుకు వీలులేకుండా పోయింది. సర్పంచులు ఆయా గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మూడు నెలలుగా పాత ఖాతాలకు ఫ్రీజింగ్ ఉండటంతో ఎస్టీవోకు పంపించిన చెక్కులు కూడా కాలపరిమితి ముగుస్తుండటంతో వారిచెక్కులు వాపస్ ఇస్తున్నారు.

రూ.6 లక్షల బిల్లు రావాలి



గ్రామపంచాయతీ ఖాతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు ఉండటంతో గ్రామంలో రూ.6 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించాం. కానీ రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు తీసుకునేందుకు ఫ్రీజింగ్ పెట్టడంతో పనులు పూర్తయి రికార్డు అయి నెలలు గడుస్తున్నా బిల్లులు రావడం లేదు. – చెరుకు జాన్, సర్పంచ్, లక్ష్మీపూర్

త్వరలో బిల్లులు చెల్లిస్తాం



గ్రామపంచాయతీ ఖాతాల్లో ఉన్న డబ్బుకు ఆయా గ్రామాల్లో పని చేసిన పనులకు త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం. ఎలాంటి ఆందోళన అవసరం లేదు. – నరేశ్, డీపీవో, జగిత్యాల

క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి



మల్యాల(జగిత్యాల): మల్యాల మండల కేంద్రంలోని జగ్గని ఒర్రె మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, మల్యాల సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్ సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్‌లను వరంగల్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈమేరకు సానుకూలంగా స్పందించారని మిట్టపల్లి సుదర్శన్ తెలిపారు.

అరగుండాల ప్రాజెక్టు పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామశివారులోని అరగుండాల ప్రాజెక్టు పునఃనిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని నీటిపారుల శాఖ డీఈ చక్రూనాయక్ తెలిపారు. గత వర్షాలకు అరగుండాల ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో తిరిగి నిర్మించేందుకు పత్రిపాదనలు పంపించగా.. నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ నుంచి ప్రభుత్వానికి రూ.1.41 కోట్లు మంజూరుకు అనుమతుల కోసం పంపించినట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌ను బెదిరించిన వ్యక్తులపై కేసు

రాయికల్(జగిత్యాల): రాయికల్ మున్సిపల్ కమిషనర్ గంగుల సంతోశ్‌కుమార్‌ను దుర్భషలాడుతూ బెదిరింపులకు గురిచేసిన బెజ్జారపు శ్రీనివాస్, చంద్రశేఖర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. రాయికల్‌లోని 11వ వార్డులో బెజ్జారపు శ్రీనివాస్ మున్సిపల్ అనుమతులు లేకుండా గృహ నిర్మాణ పనులు చేపట్టగా ఈనెల 27న నోటీసులు ఇచ్చారు. ఈనెల 29న చంద్రశేఖర్ మున్సిపల్ కమిషనర్‌కు రాత్రిపూట ఫోన్ చేసి ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడుతూ బెదిరింపులకు గురిచేయగా కమిషనర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కవలల మృతిపై ఆసుపత్రి వద్ద ఆందోళన

కోరుట్ల: పట్టణంలోని సాహితి ఆసుపత్రిలో ఆదివారం తెల్లవారుజామున ఇద్దరు కవల పిల్లలు మృతి చెందటంపై గర్భిణి బంధువులు సోమవారం సాయంత్రం ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణానికి చెందిన ఓ గర్భిణికి కడుపునొప్పి రావటంతో ఆదివారం రాత్రి ఆసుపత్రిలో చేరింది. పరీక్షించిన డాక్టర్ ఇద్దరు పాపల్లో ఓ పాప కడుపులోనే మృతి చెందిందని పేర్కొని పాపను బయటకు తీసింది. మరో రెండు గంటల తర్వాత ఇంకో పాప కూడా చనిపోయిందని ఆ పాపను కూడా కడుపులో నుంచి బయటకు తీసింది. దీంతో డాక్టర్ నిర్లక్ష్యంతోనే పాపలిద్దరూ మృతి చెందారని గర్భిణి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు చేశారు.

ఇద్దరిని బలిగొన్న రోడ్డు ప్రమాదాలు


శ్వేతారెడ్డి మృతదేహం


భూదమ్మ (ఫైల్)

తిమ్మాపూర్(మానకొండూర్): మండల పరిధిలోని రాజీవ్ రహదారిపై సోమవారం రెండు గంటల వ్యవధిలో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మహిళల ప్రాణాలు గాల్లో కలిశాయి. ఉదయం 7.30 నుంచి 9.30 గంటల మధ్యలో రెండు ప్రమాదాలు జరిగాయి. పోలీసులు ఒక ప్రమాదం వద్దకు చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ట్రాఫిక్ క్లియర్ చేసి తిరిగి వెళ్లే సమయంలో మరో ప్రమాదం జరిగింది. ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి కథనం.. ఉదయం 7.30 గంటలకు కొత్తపల్లి స్టేజ్ వద్ద కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న టిప్పర్.. యూటర్న్ చేసుకునే సమయంలో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన చాడ సతీశ్‌రెడ్డి– శ్వేతారెడ్డి(35) దంపతులు గాయపడ్డారు. యూటర్న్ సమయంలో చౌరస్తా వద్ద హోటల్ సమీపంలో కారు నిలిపి ఉంది. ఈ క్రమంలో టిప్పర్ మధ్య భాగంలో ఉన్న టైర్‌కు సతీశ్‌రెడ్డి బైక్ తగలడంతో ఇద్దరూ కిందపడ్డారు. టిప్పర్ డ్రైవర్ గమనించకుండా లారీని ముందుకు పోనివ్వడంతో శ్వేతారెడ్డి పైనుంచి వెళ్లింది. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. వీరిది చిగురుమామిడి మండలం రేకొండ గ్రామం కాగా రెండేళ్ల క్రితం కొత్తపల్లిలో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. తిరిగి ఎల్ఎండీకి వస్తుండగా ఉదయం 9.30 గంటలకు నుస్తులాపూర్ గ్రామానికి చెందిన గట్టు భూదమ్మ (65) నుస్తులాపూర్ నుంచి ఆటోలో రామకృష్ణ కాలనీకి చేరుకుంది. రాజీవ్ రహదారి దాటుతుండగా గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో భూదమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ఘటన స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. మృతురాలి వద్ద రూ.60 వేల నగదు ఉండగా కుటుంబ సభ్యులకు అందజేశారు. శ్వేతారెడ్డికి కూతురు, కొడుకు ఉండగా, భూదమ్మకు కొడుకు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రెండు కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రిమిసంహారక మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య


పోశవ్వ మృతదేహం

వెల్గటూర్: ఎండపల్లి మండలం గొడిశెలపేటలో ఆదివారం కడుపునొప్పి భరించలేక ఓరుగంటి పోశవ్వ(73) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. పోశవ్వ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోందని, ఆస్పత్రిలో చూపించినా తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కొడుకు ఓరగంటి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

కరీంనగర్‌క్రైం: మద్యానికి బానిస కావడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాలు.. కరీంనగర్ రాంనగర్‌కు చెందిన తుల్ల శ్రీనివాస్(43) మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు డ్రైవర్‌గా పనిచేశాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసై రోజూ మద్యం తాగి ఇంటికి వెళ్లేవాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు కూడా ఉన్నాయి. ఆదివారం మద్యం తాగి రాగా అతడి కుటుంబ సభ్యులు మందలించారు. వారువో ఫంక్షన్‌కు వెళ్తామని, రావాలని అడుగగా రాను అని చెప్పి ఇంట్లోనే ఉన్నాడు. రాత్రి 9.30 గంటలకు కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చేసరికి బెడ్ రూంలోని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు 108కు ఫోన్ చేయగా వారు వచ్చి అప్పటికే మృతిచెందాడని తెలిపారు. తన భర్త మద్యానికి బానిసవడంతో పాటు ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని సోమవారం మృతుడి భార్య టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

జమ్మికుంట(హుజూరాబాద్): గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంచిర్యాల రైల్వే పోలీసుల వివరాల ప్రకారం..జమ్మికుంట, ఉప్పల్ రైల్వేస్టేషన్ల మధ్య ఏపీ ఎగువ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి 40 ఏళ్ల వయస్సుగల గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి వద్ద ఎలాంటి చిరునామా, ఆధారాలు లేవు. ఒంటిపై బ్లూరంగు జీన్స్ ప్యాంట్, తెలుపు రంగు చొక్కా, మెడకు నల్లటి దారంతో ఆంజనేయుని బొమ్మగల మెటల్ లాకెట్, కుడి చేతికి తెలుపు రంగు ఉంగరం, కుడి చేతిపై ఏ అక్షరం పచ్చబొట్టు ఉంది. పై ఆధారాల ద్వారా మృతిచెందిన వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులు, మంచిర్యాల ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ కెంసారపు సంపత్‌కు సమాచారం ఇవ్వాలని, 83285 12176, 94409 00792 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు

అనుమానాస్పదంగా నాగ సాధువుల సంచారం


పరికరాలు పరిశీలిస్తున్న ఎస్సై చిరంజీవి

మల్యాల(చొప్పదండి): మల్యాల మండలంలోని వివిధ గ్రామాల్లో నాగ సాధువుల సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. సోమవారం ఆయా గ్రామాల్లో సంచరిస్తున్న నాగసాధువులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్సై చిరంజీవి, కౌన్సెలింగ్ నిర్వహించారు. వివరాలు తెలుసుకొని వారివద్ద ఉన్న పరికరాలు తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానిత వస్తువులు లేవని నిర్ధారించి వారిని వదిలేశారు. ఉత్తరప్రదేశ్ నుంచి కొంత మంది నాగ సాధువులు గ్రామాలకు వస్తున్నారని, వారికి ఎవరూ ఏమీ ఇవ్వొద్దని కొందరు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు.

తప్పిపోయిన చిన్నారి ఆచూకీ లభ్యం

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి సంజయ్‌గాంధీనగర్‌లో సోమవారం తప్పిపోయిన చిన్నారి మమతా తాండీ దొరికింది. చిన్నారి ఇంటి వద్ద ఉన్న కంచె సమీపంలో ఆచూకీ లభ్యం కావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

'భవనాలు నిర్మించకపోవడం సిగ్గుచేటు'


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి

బుగ్గారం(ధర్మపురి): బుగ్గారం నూతన మండలంగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించకపోవడం సిగ్గుచేటని జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం బుగ్గారంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ధర్మపురి నియోజకవర్గం అభివృద్ధి పరంగా అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. ఇందుకు మంత్రి ఈశ్వర్ అసమర్థతనే కారణమని అన్నారు. మెరుగైన విద్య, వైద్య సౌకర్యాలు సైతం కల్పించలేదని తెలిపారు. బుగ్గారం ఎక్స్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై కనీసం ఎక్స్‌ప్రెస్ బస్సులను కూడా ఆపే చర్యలు చేపట్టకపోవడం మంత్రి అసమర్థతకు నిదర్శనమని అన్నారు. అలాగే తమ నాయకుడు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై ఈశ్వర్ చేసిన ఆరోపణలను తామంతా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో జిల్లాలో ఎన్ని రకాల అభివృద్ధి పనులు జరిగాయో ప్రజలకు తెలుసునని అన్నారు. పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన జోడో అభియాన్ యాత్ర స్ఫూర్తిగా నియోజకవర్గ స్థాయిలో హత్ సే హత్ జోడో అభియాన్ యాత్రను బుగ్గారం మండలం నుంచే ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ గడప గడపకు ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, నాయకులు నర్సాగౌడ్, కండ్లె మదన్, రెంటం శ్రీధర్, బత్తుల తిరుపతి, సిగిరి అంజిత్‌కుమార్, నగునూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వలసజీవి మృతదేహం తెప్పించేందుకు కృషి


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మోహన్

కథలాపూర్: సౌదీ అరేబియా దేశంలో వారం క్రితం మృతి చెందిన కుమ్మరి నర్సయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు కృషి చేస్తానని వేములవాడకు చెందిన ఆద్య గోలి ఫౌండేషన్ చైర్మన్ గోలి మోహన్ అన్నారు. సోమవారం కథలాపూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తాము ఉండటానికి ఇల్లు లేదని, ఈ పరిస్థితుల్లో గల్ఫ్ నుంచి నర్సయ్య మృతదేహాన్ని తెప్పించేందుకు డబ్బులు లేవని బాధిత కుటుంబం కన్నీటిపర్యంతమైంది. స్పందించిన గోలి మోహన్ సౌదీలోని అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వారం రోజుల్లో నర్సయ్య మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించే ఏర్పాట్లు చేస్తామని, అందుకు అయ్యే ఖర్చును భరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మృతుడి కుమారుడిని ఉన్నత చదువులు చదివించేందుకు ఆర్థిక సహకారం కూడా అందిస్తామన్నారు. ఆయన వెంట నాయకులు గసికంటి వేణు, పోకతోట రాజం, అంబేద్కర్ సంఘం నాయకులు పంబాల లక్ష్మణ్, చాకలి వెంకటేశ్, శంకర్, గణేశ్ తదితరులు ఉన్నారు.

గవర్నర్‌ను తొలగించాలని రాష్ట్రపతికి లేఖ


లేఖతో ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ నాయకులు

రాయికల్(జగిత్యాల): రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న గవర్నర్ తమిళిసై సందరరాజన్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ సోమవారం రాష్ట్రపతికి లేఖ రాసినట్లు ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు దూసరి అశోక్‌గౌడ్ తెలిపారు. లండన్ నుంచి ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ.. తెలంగాణ గవర్నర్ తమిళిసై రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని తప్పుపట్టారు. వెంటనే ఆమెను పదవి తొలగించాలని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు ఈమెయిల్ ద్వారా లేఖ రాసినట్లు తెలిపారు. తెలంగాణ బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ అభివృద్ధికి ఆటంకంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు రత్నాకర్, హరిగౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: ఆస్తి విషయంలో కక్ష పెంచుకొని దగ్గరి బంధువును కత్తితో తీవ్రంగా గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడిన నేరంలో నిందితుడు మహమ్మద్ షానవాజ్(36)కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎం.అరుణ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కరీంనగర్ పట్టణం కశ్మీర్ గడ్డకు చెందిన మహమ్మద్ షానవాజ్ తండ్రి చెల్లెలు కొడుకు అయిన మహమ్మద్ గయాసుద్దీన్ (54) ప్రభుత్వ ఉద్యోగి. షానవాజ్ తండ్రి మహమ్మద్ నవాజ్ బతికి ఉన్న సమయంలో తన మేనత్త అయిన గయాసుద్దీన్ తల్లి పేరా ఆస్తులు రాశాడని, వాటిని తనకు తిరిగి ఇవ్వాలని షానవాజ్, గయాసుద్దీన్‌తో తరచూ గొడవ పడేవాడు. దానికి వారు ఒప్పుకోకపోవడంతో అతడిపై కక్ష పెంచుకున్నాడు. 2018 నవంబర్ 7న మధ్యాహ్నం కూరగాయల కోసం గయాసుద్దీన్ కశ్మీర్‌గడ్డ రైతుబజార్‌కు వెళ్లగా అక్కడ కాచుకొని ఉన్న షానవాజ్ అతడ్ని కత్తితో తీవ్రంగా గాయపరిచాడు. ఈ సంఘటనపై బాధితుడి భార్య సల్మా ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి కోర్టులో ప్రవేశపెట్టి వాదించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి అరుణ, నిందితుడు షానవాజ్‌కు జైలుశిక్ష, జరిమానా విధించారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కొత్తపల్లి(కరీంనగర్): గంగాధర మండలం గట్టుభూత్కూర్ గ్రామానికి చెందిన కాంపెల్లి తిరుపతికి విద్యుత్ చౌర్యం కేసులో జిల్లా కోర్టు జైలు శిక్ష విధించినట్లు విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తూ పట్టుబడగా రూ.500 జరిమానా విధించి మొదటి తప్పుగా క్షమించడమైందన్నారు. విద్యుత్ అధికారులు తనిఖీలు నిర్వహించగా మళ్లీ రెండోసారి అనుమతి లేకుండా విద్యుత్‌ను వాడుతూ దొరకగా కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి భవానిచంద్ర ఈ కేసుపై విచారణ జరిపి నిందితుడు విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు తేలడంతో రూ.21,108 జరిమానా చెల్లించాలని లేదా మూడునెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వెలువరించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్సై నిరంజన్‌రెడ్డి, కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

పొలం దున్నుతుండగా బావిలో పడిన ట్రాక్టర్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి ట్రాక్టర్ బావిలో పడగా.. యజమానికి భయపడి డ్రైవర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సోమవారం మండల కేంద్రంలో జరిగింది. స్థానికుల వివరాలు.. గ్రామానికి చెందిన నిమ్మల శ్రీధర్ అనే రైతు వద్ద అదే గ్రామానికి చెందిన రానవేన సాగర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పొలం దున్నతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి ప్రమాదవశత్తు పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడింది. అప్రమత్తమైన డ్రైవర్ సాగర్ ట్రాక్టర్‌పై నుంచి దూకి తప్పించుకున్నాడు. కాగా యజమానికి భయపడి ఏమంటాడో అని ఆందోళనకు గురై పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సాగర్ ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

రైతుల చూపు.. ఆయిల్‌పామ్ సాగువైపు

- జిల్లాలో లక్ష్యాన్ని మించుతున్న సాగు
- ఎప్పటికప్పుడు మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు


ఆయిల్‌పామ్ నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. దీనికి ఉద్యానశాఖకు రైతులు అందజేసిన దరఖాస్తులు స్పష్టం చేస్తున్నాయి. 2023 జనవరి నుంచి ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటేలా ఉద్యానశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. జగిత్యాల జిల్లా దరఖాస్తుల స్వీకరణలో రాష్ట్రంలోనే మొదటి ఐదు స్థానాల్లో ఉండగా.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొదటిస్థానంలో ఉంది. ఈనేపథ్యంలో జిల్లాలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆయిల్‌పామ్ మొక్కలను నాటే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఇప్పటికే ఆయిల్‌పామ్ మొక్కల కోసం రైతులు తమ పొలాల్లో తవ్విన గుంతలను ఉద్యానశాఖ అధికారులు పరిశీలించారు.

అబ్బాపూర్‌లో ఆయిల్ ఫాం మొక్కలు సిద్ధం

జిల్లాకు ఆయిల్‌పామ్ మొక్కలను సరఫరా చేసేందుకు ప్రభుత్వం లోహియా ఇండస్ట్రీస్ (గోల్డ్ డ్రాప్ ఆయిల్)ను నియమించింది. ఈ కంపెనీ గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌లో ఆయిల్‌పామ్ మొక్కల నర్సరీని ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా ఆయిల్‌పామ్ మొక్కలకు డిమాండ్ ఏర్పడటంతో, విత్తనాల కొరతతో మొక్కల సరఫరాకు కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. వాస్తవంగా జూన్, జూలై నెలల్లో ఆయిల్‌పామ్ మొక్కలను సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ విత్తనాలను మలేషియా, ఇండోనేషియా దేశాల నుంచి తెప్పించి నర్సరీని పెంచారు. విత్తనాలను ప్రత్యేక ప్లాస్టిక్ కవర్లలో నాటి, ఏడాది మొక్కల వరకు నర్సరీలో అనుభవజ్ఞులైన అధికారుల సమక్షంలో అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటించి పెంచాల్సి ఉంటుంది. జిల్లా రైతుల నుంచి అధికంగా ధరఖాస్తులు రావడంతో అబ్బాపూర్‌లో మొక్కలు సరిపోకపోతే కరీంనగర్ నర్సరీ నుంచి ఇప్పించాలని ఉద్యానశాఖ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులను ఖమ్మం జిల్లా అశ్వరావుపేటలో ఆయిల్‌పామ్ తోటల సందర్శనతో పాటు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి తీసుకెళ్లారు.

ఎప్పటికప్పుడు ఉద్యానశాఖ తనిఖీలు

లోహియా కంపెనీ ఉత్పత్తి చేస్తున్న ఆయిల్‌పామ్ మొక్కలను నాలుగైదు రోజులకొకసారి ఉద్యానశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. నాణ్యత లేని మొక్కలను తీసి వేసి, మొక్కల ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. అలాగే రైతులతో ఉద్యానశాఖ సమావేశాలు ఏర్పాటు చేసి సాగు, సబ్సిడీ విధానాలను వివరిస్తున్నారు. మొక్కలు నాటే ముందు భూమిని ఎలా సిద్ధం చేయాలి, గుంతలు తీసే సమయంలో ఎలాంటి ఎరువులు వేయాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు. ఇటీవల కలెక్టర్ రవి సైతం ఉద్యానశాఖ, లోహియా కంపెనీ అధికారులతో కలిసి నర్సరీలో పెంచుతున్న ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయిల్‌పామ్ గెలలకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర లేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో పామాయిల్ ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉద్యానశాఖ రేటు నిర్ణయిస్తుంది. ప్రస్తుతం పామాయిల్ గెల ధర టన్నుకు రూ 13,750 వరకు ఉంది. ఆయిల్‌పామ్ మొక్కలను ఒక్కసారి నాటితే 40 ఏళ్ల వరకు అదాయం ఇచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా, కోతులు, అడవి పందులు, పక్షుల బెడద ఉన్న వారు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు వస్తున్నారు.

లక్ష్యం 9 వేల ఎకరాల్లో..

జిల్లాలో ఈ ఏడాది ఆయిల్‌పామ్ తోటల సాగు లక్ష్యం 9వేల ఎకరాలు. అయితే, ఇప్పటికే 4,500 ఎకరాల లక్ష్యాన్ని పూర్తి చేశారు. ఇందుకు సంబంధించిన రైతులు ఆయిల్‌పామ్ మొక్కలను జనవరి, ఫిబ్రవరిలో నాటుతున్నారు. మిగతా 4,500 ఎకరాల లక్ష్యాన్ని మార్చిలో నాటేలా ఉద్యానశాఖ ప్రణాళిక రూపొంచి ధరఖాస్తులను ఆహ్వానించింది. ప్రతీ రైతు ఎన్ని ఎకరాల్లో అయితే ఆయిల్‌పామ్ సాగు చేస్తారో, సబ్సిడీ పోను రైతు వాటాగా చెల్లించే డబ్బులను ధరఖాస్తుతో ఉద్యానశాఖ అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ధరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఆయిల్‌పామ్ తోటలు నాటే రైతులకు డ్రిప్(బిందు సేద్య పద్ధతి) పరికరాలు మంజూరు చేస్తున్నారు.

రైతులు ఆసక్తి చూపుతున్నారు



జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనబర్చుతున్నారు. ధరఖాస్తు చేసుకున్న రైతులకు డ్రిప్ పరికరాలు, ఆయిల్‌పామ్ మొక్కలను సబ్సిడీపై ఇస్తున్నాం. ఇప్పటికే 4,500 ధరఖాస్తులు వచ్చాయి. మార్చి నెలాఖరు వరకు ఇంకా ధరఖాస్తులు రానున్నాయి.

– ప్రతాప్‌సింగ్, జిల్లా ఉద్యానశాఖ అధికారి, జగిత్యాల